


# కరపత్రం

SINCE 2014

మంగళవారం అక్టోబర్ 15 2024 | సంపుటి :0 | సంచిక : 7 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


# పేదల కడుపు నింపడం

## కేసీఆర్ అజెండా..

**ఉద్యమంలో అలయ్ బలయ్ అందరిని ఒక్కటి చేసింది**
**పేదల కడుపు నింపడం కేసీఆర్ అజెండా**
**పేదల కడుపు కొట్టడం కాంగ్రెస్ ఎజెండా**
**సంగుపేట అలయ్ బలయ్ కార్యక్రమంలో మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలు**



తెలంగాణ ఉద్యమంలో అలయ్ బలయ్ కార్యక్రమం అందరిని ఒక్కటి చేసిందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. సంగుపేట అలయ్ బలయ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ఉన్నప్పుడు గ్రామాల్లో పారిశుధ్యం ఎలా ఉంది ఇప్పుడు ఎలా ఉంది? అని ప్రశ్నించారు. సంజీవన్ రావు పేటలో పండుగ పూట ఏం అయ్యిందో చూశామన్నారు. పేదల కడుపు నింపడం కేసీఆర్ అజెండా.. పేదల కడుపు కొట్టడం కాంగ్రెస్ ఎజెండా అని విమర్శించారు. బతుకమ్మ చీరలు రెండు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేదు.. వర్షాకాలం రైతు బంధు లేదన్నారు. రుణమాఫీ సరిగా కాలేదని.. ఋణమాఫీపై డేట్లు పొడగిస్తున్నారన్నారు. నిన్న వ్యవసాయ శాఖ మంత్రి మళ్ళీ 2024 డిసెంబర్ 9 అంటూ కొత్త తేదీ చెప్పారని గుర్తు చేశారు.రైతు భరోసా ఎప్పుడు ఇస్తారో చెప్పరని.. ఎంత ఇస్తారో చెప్పరని మంత్రి హరీష్ రావు అన్నారు. నిరుద్యోగులకు ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు అని ఊరించి మోసం చేశారని మండిపడ్డారు. నిరుద్యోగులకు కనీసం నిరుద్యోగ భృతి కూడా ఇవ్వలేదన్నారు. కేసీఆర్ ఇచ్చిన 30 వేల ఉద్యోగాలే తప్ప కాంగ్రెస్ వాళ్లు ఇచ్చింది ఏమి లేదన్నారు.

# టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ హాల్ టికెట్లు విడుదల

**ఈ మేరకు హాల్‌టికెట్లను తన అధికారిక వెబ్‌సైట్‌లో టీజీపీఎస్సీ పొందుపరిచింది. ఈ నెల 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 31,382 మంది అభ్యర్థులు గ్రూప్-1 మెయిన్స్‌కు అర్హత సాధించారు.**




# ఫాక్స్‌కాన్ కంపెనీ పనులను పర్యవేక్షించిన సీఎం రేవంత్..



- ఫాక్స్‌కాన్ కంపెనీ పనులను పర్యవేక్షించిన సీఎం రేవంత్
- ఫాక్స్ కాన్ కంపెనీ ప్రతినిధులతో సీఎం సమావేశం
- మరిన్ని పెట్టుబడులు పెట్టాలని కోరిన ముఖ్యమంత్రి
- సీఎంతో పాటు ఐటీ మంత్రి శ్రీధర్ బాబు
- వరుస యాత్రలతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బిజీబిజీ..

**రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్ లో నూతనంగా ఏర్పాటు అవుతున్న ఫాక్స్ కాన్ కంపెనీ పనులను పరిశీలించేందుకు సీఎం రేవంత్ రెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఫాక్స్ కాన్ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, కేఎల్ఆర్ భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి, మంత్రి కొంగరకలాన్ ఫాక్స్ కాన్ కంపెనీని సందర్శించారు. ఫాక్స్ కాన్ కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కంపెనీ పురోగతి, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు.**

ఫాక్స్ కాన్ చైర్మన్ యాంగ్ లియూ తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం మాట్లాడారు.కంపెనీకి కావాల్సిన మౌలిక సదుపాయాల విషయంలో ఎలాంటి అనుమానం అక్కర్లేదని రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. మరిన్ని విభాగాల్లో పెట్టుబడులకు ముందుకు రావాలని కోరారు. ఎలక్ట్రిక్, లిథియం బ్యాటరీ విభాగాల్లోనూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఫాక్స్ కాన్ కంపెనీని సీఎం కోరారు.ఫాక్స్‌కాన్ కంపెనీ పనులను పర్యవేక్షించిన సీఎం రేవంత్.. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వరుస యాత్రలతో బిజీబిజీగా గడుపుతున్నారు. ఇప్పటికే దసరా పండుగ నేపథ్యంలో యథావిధిగా నాగర్ కర్నూల్ జిల్లా సొంతూరు కొండారెడ్డిపల్లె, ఆ తర్వాత తన నియోజకవర్గం కొడంగల్ లో సీఎం పర్యటించిన సంగతి తెలిసిందే. నేడు ముఖ్యమంత్రి రేవంత్ రంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్నారు. సీఎం తో పాటు మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొననున్నారు. సాయంత్రం 4 గంటలకు రేవంత్ రెడ్డి కొంగరకలాన్ చేరుకుంటారు. అక్కడ ఫాక్స్ కాన్ కంపెనీ పనుల పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించనున్నారు. కాగా, 2023లో ఫాక్స్ కాన్ కంపెనీ తెలంగాణకు వచ్చింది.. కొంగరకలాన్ లో 250 ఎకరాల్లో ఎలక్ట్రానిక్ కంపెనీని ఏర్పాటు చేయాలని ఫాక్స్ కాన్ నిర్ణయించింది. దాదాపు లక్ష మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు పెట్టుబడులు పెట్టబోతున్నట్లు ఫాక్స్‌కాన్ సీఈవో యంగ్ లియు వెల్లడించారు.కొడంగల్ పర్యటన అనంతరం నిన్న(ఆదివారం) మధ్యాహ్నం హైదరాబాద్ చేరుకున్న రేవంత్ నేరుగా బండారు దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

# రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు..

## నవంబర్1 నుంచి బీజేపీ ఉద్యమ బాట..

- పదేళ్లు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు
- నవంబర్1 నుంచి బీజేపీ ఉద్యమ బాట
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం

ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 2014 లో బీజేపీ సభ్యత్వ సేకరణ తర్వాత 2024 లో చేస్తున్నామన్నారు. సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశానికి హాజరైన మంత్రి మాట్లాడారు. నూతనంగా గ్రామీణ మండల జిల్లా వ్యాప్తంగా నూతన కమిటీ సేకరణ ఏర్పాటు చేస్తామన్నారు. నవంబర్ 1 నుంచి బీజేపీ ఉద్యమ బాట పట్టనుందన్నారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత 10 సంవత్సరాల పాలనలో గత ప్రభుత్వాలు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాయని మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబ పాలనలో రాష్ట్రం వెనుకబడిందన్నారు. రాష్ట్రంలో ఎలాంటి సంక్షేమ సరిగా పథకాలు అమలు కాలేదని ఆరోపించారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ తరహాలోనే వ్యవహరిస్తుందని కేంద్ర మంత్రి విమర్శించారు. పేదలకు ఇల్లు కట్టకుండా పేదల ఇళ్లను కొల్చున్న ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీదన్నారు. అతి తక్కువ సమయంలో ప్రజల వ్యతిరేకతను కాంగ్రెస్ ప్రభుత్వం కూడగట్టుకుందని తెలిపారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్ అప్పుల పాలు చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం మూసి సుందరీకరణ పేరుతో రూ.లక్ష 80 వేల కోట్ల బడ్జెట్ కేటాయించి ఇంతవరకు డీపీఆర్ తయారు చేయలేదన్నారు. కాంగ్రెస్‌పై వ్యతిరేకతతోనే హర్యానా రాష్ట్రంలో బీజేపీకి ప్రజలు పట్ట కట్టారన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ సహకరించకుండా కూడా ముందుకు పోనున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జమ్మూ కాశ్మీర్ లో బీజేపీకి గణనీయంగా ఓట్ల శాతం పెరిగిందని పార్టీని కొనియాడారు. ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో బీజేపీకి అధిక ఓట్లు రావడం విశేషమన్నారు.



# తెలంగాణ గ్రామీణ రోడ్లకు మహర్దశ..

## రూ. 1377.66 కోట్లు మంజూరు



తెలంగాణ గ్రామీణ రోడ్లకు మహర్దశ రానుంది. రాష్ట్ర ప్రభుత్వం నూతన రోడ్ల నిర్మాణానికి రూ. 1377.66 కోట్లు మంజూరు చేసింది. 92 నియోజకవర్గాల్లో 641 పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. గ్రామీణ ప్రాంతాల్లో 1323.86 కిలోమీటర్ల మేర నూతన రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నా.. గ్రామీణ రోడ్లకు పట్టు బట్టి నిధులు సాధించామని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు.ఇదిలా ఉండగా.. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. వికలాంగుల జాబ్ పోర్టల్ ను ఏర్పాటు చేసింది. దివ్యాంగులు ఆఫీసర్ల చుట్టూ తిరిగే పనిలేకుండా నేరుగా జాబ్ పోర్టల్ లో అప్లై చేసుకుంటే చాలని, వారి అర్హతను బట్టి ఉద్యోగం ఉంటుందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శుభవార్త చెప్పారు. ఈ మేరకు సచివాలయంలో తెలంగాణ వికలాంగుల జాబ్ పోర్టల్ ను ఆవిష్కరించారు. మహిళా సంక్షేమ శాఖ డైరెక్టరేట్ హెల్ప్ లైన్ లో పదిమందికి అపాయింట్మెంట్ ఆర్డర్లు అందజేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఉపాధి రంగాల్లో దివ్యాంగులకు అవకాశాలు తక్కువ అన్నారు.

# డీవోపీటీ ఉత్తర్వులు రద్దు చేయండి..

## క్యాట్‌లో ఐఏఎస్ అధికారుల పిటిషన్లు




డీఓపీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ పలువురు ఐఏఎస్ అధికారులు క్యాట్‌ను ఆశ్రయించారు. కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్) ఆదేశాలతో ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లలో కొనసాగుతున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పునర్విభజన చట్టం ప్రకారం కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్ట్ చేయాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం (డీఓపీటీ) ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు డీఓపీటీ కార్యదర్శి ఆదేశాలు సైతం జారీ చేశారు. అయితే డీఓపీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ పలువురు ఐఏఎస్ అధికారులు క్యాట్‌ను ఆశ్రయించారు. డీవోపీటీ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, వాణి ప్రసాద్, ఆమ్రపాలి, సృజన క్యాట్‌లో వేర్వేరుగా పిటిషన్‌లు దాఖలు చేశారు.

# ఏం ఆశించి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెడుతున్నారు: కేటీఆర్



వీఎల్‌ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణంతో మూసీ అంతర్ధానమవుతుందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు.ఓ వైపు మూసీ నదికి ముఖ్యమంత్రే మరణశాసనం రాస్తూ.. మరోవైపు సుందరీకరణ ప్రాజెక్టు చేపడతారా?అని ప్రశ్నించారు. పదేళ్లు ఒత్తిడి చేసినా రాడార్ స్టేషన్‌కు భారాస ప్రభుత్వం ఒప్పుకోలేదని, ఏం ఆశించి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెడుతోందని నిలదీశారు. దామగుండం రాడార్ స్టేషన్‌ను భారాస వ్యతిరేకిస్తోందని, స్టేషన్‌కు వ్యతిరేకంగా పర్యావరణవేత్తలతో కలిసి పోరాటం చేస్తామని చెప్పారు

# మూడు రోజుల పాటు తెలంగాణలో వర్షాలు



తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, మెదక్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్, ములుగు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. మంగళ, బుధవారాల్లో ఉమ్మడి నిజామాబాద్, ఖమ్మం, నల్గొండ, వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్‌తోపాటు నిర్మల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవొచ్చు.ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

# సంపాదకీయం

## కొత్త పాఠకులు ఏం చదువుతున్నారు...

తెలుగులో పుస్తకాలు చదవడం మొదలుపెట్టాలి అనుకొనేవాళ్ళకి కొన్ని పుస్తకాలు చెప్పమంటే, ఎక్కువమంది తమకి నచ్చిన పుస్తకాల గురించి చెప్పేవారు. 2021 హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో ఆ పుస్తకాలను వెతికి కొన్నాను. కానీ చదవడానికి ఇబ్బంది పడ్డాను. క్లిష్టమైన భాషే కాకుండా, నాకు తెలియని ఎన్నో గొప్ప సిద్ధాంతాలతో ఉన్న పుస్తకాలు అవి. కానీ ఒక కొత్త పాఠకుడు సులువుగా అర్థమయ్యే పుస్తకాలను చదవడానికి ఇష్టపడతాడు. ఇలాంటి బిగినర్ ఫ్రెండ్లీ పుస్తకాల గురించి మాట్లాడంతోపాటు, సమకాలీన సాహిత్యాన్ని అందరికీ పరిచయం చెయ్యాలి అనే ఉద్దేశంతో మొదలు పెట్టిందేతెలుగు ఇన్‌స్టాగ్రామ్ పేజీ. ఈరోజుకు దాదాపు 25వేల మంది ఫాలోయర్స్ ఉన్నారు. ఎక్కువమంది 30ఏళ్ల లోపువారే. తెలుగు పుస్తకాలు ఈ మధ్యనే మొదలుపెట్టిన వాళ్ళ నుంచి ఎన్నో ఏళ్లుగా చదువుతున్న వాళ్ళ దాకా అందరూ ఉన్నారు. ఈ ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా పుస్తక పరిచయాలు మాత్రమేగాక, 'మీట్ గ్రీట్' పేరుతో బుక్ క్లబ్ కూడా నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమంలో ఒక పుస్తక రచయితను పాఠకులు కలుసుకొని ఆ పుస్తకంపై తమ అభిప్రాయాలు, సందేహాల గురించి చర్చించే అవకాశం ఉంటుంది. ఈ పేజీ నిర్వ హణలో భాగంగా కొత్త పాఠకులు, వారి అభిరుచుల గురించి తెలుసుకొనే అవకాశం నాకు దొరికింది. ఇప్పుడు 'వివిధ' పేజీ తరఫున 30ఏళ్ల లోపు పాఠకులు కొందరితో మాట్లాడాను. వారు చదివిన మొదటి పుస్తకం ఏమిటి? ఇష్టమైన రచయిత (రచయిత్రి) ఎవరు? ఎక్కువగా చదవడానికి ఇష్టపడే జానర్ ఏమిటి? పుస్తకాలు ఎక్కడ కొంటారు? లాంటి ప్రశ్నలను అడిగితే వారి నుంచి వచ్చిన జవాబులు ఇవి.నేను జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణిని మరోపక్క పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నాను. బాల్యం నుంచే పుస్తక పఠనం చేస్తున్నాను. నేను చదివిన మొదటి నవల 'మానవి'. దీనిని ఓల్గా గారు రచించారు. వీరు నాకు ఇష్టమైన రచయితల్లో ముఖ్యులు. దళిత, స్త్రీవాద, సామాజిక స్పృహ కలిగిన పుస్తకాలు చదువుతాను. అన్ని రచనా ప్రక్రియలు చదువుతాను. వ్యాసాలు నన్ను ఎక్కువ ఆకట్టుకొంటాయి. మనం ఏ స్థితిలో ఉన్నా, పుస్తక పఠనం గుండె నిబ్బరాన్నీ స్థిత ప్రజ్ఞతను ఇస్తుందని నమ్ముతాను. పుస్తకాలను నేరుగా షాపుల్లో కొనడానికి ఇష్టపడతాను. పుస్తకం వెనక అట్ట మీద రచయిత లేదా ఇతరులు రాసిన విషయాన్ని బట్టి పుస్తకాన్ని ఎంచుకుంటాను.నేను ఒక సాఫ్ట్వేర్ ఉద్యోగిని. చిన్నప్పుడు చిట్టి వికటన్ అనే మాసపత్రికలో వచ్చే కథలను ఇష్టంగా చదివేవాడిని. నాకు నచ్చిన రచయిత కేశవరెడ్డి. సూటిగా, వ్యంగ్యంగా ఆయన వాస్తవాన్ని నిర్వచించే తీరు నచ్చుతుంది. చిన్నప్పటి చందమామ కథల ప్రభావం వల్ల పెద్ద పేరాలుగా ఉన్న నవలల కన్నా చిన్నచిన్న పేరాలతో ఉండే కథల్లాంటివి చదవడం ఇష్టం. అభ్యుదయ, భావ కవిత్వం సూటిగా ఉంటుంది కాబట్టి ఇష్టంగా చదువుతాను. సాధారణంగా నేను పుస్తకాలను షాపుల్లోనే కొంటాను. ఈమధ్య ఆడియో బుక్స్, ఆన్‌లైన్ కొనుగోలు అలవాటైంది. పుస్తకాలపై వచ్చే సమీక్షలను బట్టి, లేదా ఆ పుస్తకం ముందుమాట, కవర్ ఫోటోలు ఏమైనా కథపై ఆసక్తి కలిగిస్తే వాటిని బట్టి పుస్తకాన్ని కొంటాను.నేను ఇప్పుడు ఆర్థిక శాస్త్రంలో ఎం.ఏ చేస్తున్నాను. నేను తెలుగులో చదివిన మొదటి పుస్తకం శ్రీశ్రీ 'మహాప్రస్థానం'. నాకు కేశవరెడ్డి, సొలోమోన్ విజయ్ కుమార్ రచనలు ఇష్టం. సామాజిక జీవనాన్ని ప్రతిబింబించే రచనలు, మిస్టరీ నవలలు ఇష్టం. పుస్తకాలు బుక్ షాప్‌లో కొనడాన్ని ఇష్టపడతాను. పుస్తకం కథాసారాన్ని చదివి, లేదా ఒక్కోసారి పుస్తకం పేరును బట్టి కూడా పుస్తకాల్ని ఎంపిక చేసుకుంటాను.నేను సాఫ్ట్‌వేర్ కంపెనీలో బిజినెస్ అనలిస్టుగా పనిచేస్తున్నాను. మొదటగా పరవస్తు చిన్నయ సూరి 'నీతి చంద్రిక' చదివాను. ప్రత్యేకంగా ఇష్టమైన రచయిత అని లేరు కానీ, ఓల్గా, కె.ఎన్.వై. పతంజలి, కొడవటిగంటి, రావిశాస్త్రి రచనలు అంటే మక్కువ ఎక్కువ. మాండలికంలో ఉన్న కథలు, నాన్ ఫిక్షన్ పుస్తకాలు చదవడానికి ఎక్కువ ఇష్టపడతాను. పుస్తకాలు సాధారణంగా బుక్‌షాప్‌లలో కొనడానికే ఇష్టపడతాను. మా నాన్నగారు, లేదా ఇన్‌స్టాగ్రామ్‌లో ఉండే స్నేహితుల సూచనలతో పుస్తకాలను కొనడానికి ఇష్టపడతాను.ప్రస్తుతం సీఏగా పనిచేస్తున్నాను. మొదటి చదివిన పుస్తకం 'సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి' అని గుర్తుంది. సూర్యదేవర రామ్మోహనరావు రచనలు చదవడా నికి ఇష్టపడతాను. ఉత్కంఠభరితంగా సాగే నవలలు లేదా హాయిగా వెళ్లిపోయే షార్ట్ స్టోరీస్ ఎక్కువగా చదువుతాను. ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చే రికమెండేషన్స్‌తో దగ్గరలో ఉండే బుక్ షాపులో కొనుక్కుంటాను.నేను ఇప్పుడు హెచ్‌సీయూలో ఎం.ఏ తెలుగు చదువుతున్నాను. నేను తెలుగులో చదివిన మొదటి పుస్తకం ఓల్గా రాసిన 'విముక్త'. రచయితల్లో ఒకరు ఇష్టం అని చెప్పలేను. ప్రస్తుతానికి ఓల్గా, కేశవరెడ్డి, కొడవటిగంటి కుటుంబరావు, సొలోమోన్ విజయ్ కుమార్ రచనలు, శ్రీశ్రీ, తిలక్ వచన కవితలు బాగా ఇష్టం. మానవుల నిజమైన జనజీవనాన్ని, సంఘటల్ని కొత్త దృక్కోణంలో చిత్రించే నాటకాలు, వచన కవితలు, కథలు, నవలలు, బొమ్మల కథల పుస్తకాలు బాగా ఇష్టపడతాను. నేను పుస్తకాలు ఎక్కువగా బుక్ షాపుల్లో, ఇంకా బుక్ ఫెయిర్లో కొంటాను. స్నేహితుల సూచనలను బట్టి, కథాంశాలను బట్టి బట్టి పుస్తకాలు ఎంపిక చేసుకుంటాను.సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర'తో చదవడం మొదలుపెట్టాను. 'కాలతీత వ్యక్తులు' రాసిన శ్రీదేవి గారు నాకు చాలా ఇష్టం. ఏదైనా ఆలోచింప చేసేది కానీ ఏదైనా కొత్త అంశం చెప్పే కథలు కానీ ఎక్కువగా చదువుతాను. పుస్తకాలను నవోదయా బుక్ షాప్‌లో గానీ లేదా అమెజాన్‌లో గానీ కొనుక్కుంటాను. రచయితలను ఇన్‌స్పైర్ చేసిన రచనలను ఎన్నుకొని చదువుతాను, లేదా సమీక్షల ఆధారంగా పుస్తకాలు ఎంచుకుంటాను.సాఫ్ట్‌వేర్ రంగంలో పని చేస్తున్నాను. నేను కాలేజీలో ఉన్నప్పుడు 'మస్టర్డ్' అనే పుస్తకం చదివాను (సంపాదకులు: కడలి సత్యనారాయణ, అన్వేష్ చెట్టుపల్లి). ఈ జెనరేషన్ ఫేస్ చేస్తున్న అన్ని ఇష్యూస్ ఆ కథల్లో కనిపిస్తాయి. కొన్నిటికి రిలేట్ అయ్యాను. సీనియర్ రచయితలలో యద్దనపూడి సులోచనారాణి నా ఫేవరేట్. ప్రస్తుతం రాస్తున్న వాళ్లలో కడలి సత్యనారాయణ, మొహమ్మద్ గౌస్ రచనలు బాగా నచ్చాయి. నేను ఎక్కువగా లవ్ స్టోరీస్, థ్రిల్లర్స్ చదవడానికి ఇష్టపడతాను. పుస్తకాలను బుక్‌ఫెయిర్లో లేదా అమెజాన్‌లో కొంటాను. నచ్చిన జాన్రా అయ్యుంటే తప్పకుండా తీసుకుంటాను. లేదంటే స్నేహితుల సూచనలతో తీసుకుంటాను.ఈ మధ్యనే సాఫ్ట్‌వేర్ రంగంలోకి అడుగుపెట్టాను. చదివిన మొట్టమొదటి పు స్తకం 'బట్టి విక్రమార్క కథలు'. మనిషిని అర్థం చేయించే పుస్తకాలు ఎక్కువగా ఇష్టపడతాను. అందుకే కాశీభట్ల వేణుగోపాల్ గారు అంటే ఇష్టం. పుస్తకాలు ఎక్కువగా ఆన్‌లైన్‌లో కొనే వాడిని. ఇప్పుడు హైద రాబాద్‌లో బుక్ షాప్‌కు వెళ్లి కొంటున్నాను. స్నేహితుల సలహాలు, ఆన్‌లైన్ లో వచ్చే సమీక్షల ఆధారంగా పుస్తకాలు ఎంచుకుంటాను.ప్రస్తుతం సినిమాల్లో పని చేస్తు న్నాను. నేను చదివిన మొదటి పుస్తకం గురజాడ అప్పారావు 'కన్యా శుల్కం'. పింగళి సూరన్న, కేశవరెడ్డి రచనలు అంటే చాలా ఇష్టం. చదివే టప్పుడు డ్రామా లేదా ఫాంటసీ ఉండే నవలలు చదవడానికి ఇష్టపడతాను. మొదట్లో ఆన్‌లైన్ లేదా స్నేహితుల సలహాలతో పుస్తకాలు కొనుక్కునే వాడ్ని. కానీ ఇప్పుడు పుస్తకం వెనుక అట్ట మీద కథ గురించి రాసింది చదివి కొంటున్నాను. హైదరాబాద్‌లో ఉంటే షాపులో కొనడానికి ఇష్టపడ తాను. లేదంటే అమెజాన్, లోగిలి లాంటి వెబ్‌సైట్స్‌లో కొంటాను.ఈ మధ్యనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేరాను. 'అమరావతి కథలు'తో తెలుగు పుస్తకాలు చదవడం మొదలుపెట్టాను. కవనమాలి రచనలు నన్ను ఎప్పుడూ అబ్బుర పరుస్తాయి. ఏదో తెలియని సంతృప్తిని ఇస్తాయి. ఒక పాఠకుడిగా నాకు అన్ని రచనలు చద వాలి అని ఉంటుంది. ఒకటి ఇష్టంగా పెట్టుకుని గోడ కట్టుకోవాలి అని లేదు. హైదరాబాద్‌లో ఉన్నపుడు బుక్ షాప్‌లో కొనేవాడిని. ఇప్పుడు అమెజాన్‌లో కొంటున్నాను. పుస్తకం కవర్ పేజ్ చూసి, రచయిత ముందు రచనలని బట్టి, లేదా ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చే సజెషన్స్ను బట్టి పుస్తకాలు తీసుకుంటాను.ప్రస్తుతం అమెరికాలో అగ్రికల్చర్ మీద పీహెచ్‌డీ చేస్తున్నాను.

# పాకిస్థాన్ ప్రధాని విందుకు భారత విదేశాంగ మంత్రి!



రెండు రోజుల పాటు జరగనున్న షాంఘై సహకార సంఘం వార్షిక సమావేశంలో పాల్గొనేందుకు భారత్ విదేశాంగ మంత్రి జైశంకర్ మంగళవారం ఇస్లామాబాద్ వెళ్లనున్నారు.భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పాకిస్థాన్ పర్యటనకు సిద్ధమయ్యారు. రెండు రోజుల పాటు జరగనున్న షాంఘై సహకార సంఘం వార్షిక సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. ఈ క్రమంలో పాక్ ప్రధాని ఇచ్చే డిన్నర్‌లో జైశంకర్ పాల్గొనే అవకాశాలున్నట్లు తెలిసింది. ఇరు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్న తరుణంలో విదేశాంగ మంత్రి పాక్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.ఎస్సీవో సదస్సులో పాల్గొనేందుకు విదేశాంగ మంత్రి జైశంకర్ మంగళవారం ఇస్లామాబాద్‌కు వెళ్లనున్నారు. అనంతరం సభ్యదేశాల ప్రతినిధులకు పాక్ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్ ఇచ్చే విందులో జైశంకర్ పాల్గొనే అవకాశాలున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. మొత్తంగా ఆయన పాకిస్థాన్‌లో 24గంటల కంటే తక్కువ సమయమే ఉండనున్నట్లు సమాచారం. మరోవైపు ఈ సమావేశానికి చైనా, రష్యా ప్రధానులు కూడా హాజరుకానున్నారు. ఇందుకోసం చైనా ప్రధాని ఇప్పటికే ఇస్లామాబాద్ చేరుకున్నారు. సభ్యదేశాల నుంచి ముఖ్యులు రానున్న నేపథ్యంలో ఇస్లామాబాద్ మొత్తం భద్రతావలయంలో ఉంది.ఈ ఏడాది ఎస్సీవో సదస్సుకు పాకిస్థాన్ ఆతిథ్యమిస్తోంది. ఇందులో భాగంగా భారత్‌కూ ఆహ్వానం అందించింది. ఈ విషయాన్ని భారత ప్రభుత్వం రెండు నెలల క్రిందటే ధ్రువీకరించింది. అయినప్పటికీ.. పాకిస్థాన్‌తో ఎటువంటి ద్వైపాక్షిక చర్చలు ఉండవని స్పష్టం చేసింది. అటు పాకిస్థాన్ కూడా ద్వైపాక్షిక చర్చలపై ఇలాగే స్పందించింది. తొమ్మిదేళ్ల తర్వాత భారత విదేశాంగ మంత్రి పాకిస్థాన్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. 2015 డిసెంబర్‌లో నాటి విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ అఫ్గాన్‌పై ఏర్పాటు చేసిన ఓ సదస్సులో భాగంగా పాక్‌కు వెళ్లారు.

# కెనడా దుందుడుకు చర్యపై భారత్ తీవ్ర నిరసన



భారత్-కెనడా మధ్య విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ఈ ఏకంగా భారత దౌత్యవేత్తనే అనుమానితుల జాబితాలో చేర్చింది. దీనిని న్యూఢిల్లీ తీవ్రంగా వ్యతిరేకించింది ట్రూడో సర్కారు ఓటు బ్యాంక్ రాజకీయాలతో భారత్-కెనడా సంబంధాలు మరింత దిగజారాయి. ఇటీవల భారత హైకమిషనర్ సహా పలువురు దౌత్యవేత్తలను దర్యాప్తులో భాగంగా 'పర్సన్ ఆఫ్ ఇంట్రెస్ట్'లుగా (అనుమానితులుగా) పేర్కొంటూ కెనడా నుంచి మన విదేశాంగ శాఖకు సమాచారం అందింది. ఈ ఆరోపణలపై న్యూఢిల్లీ తీవ్రంగా స్పందించింది. ఇవి పూర్తి అసంబద్ధమైనవని పేర్కొంది. ఓటు బ్యాంక్ రాజకీయాలతో నడిచే ట్రూడో సర్కారు అజెండాకు అనుకూలంగా ఉన్నాయని మండిపడింది. కెనడా చర్యతో.. ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య కేసులో భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ పేరును అనుమానితుల జాబితాలో చేర్చినట్లైంది.2023లో ఆ దేశ ప్రధాని ట్రూడో ఆరోపణలు చేసిన నాటి నుంచి వాటికి సంబంధించి ఎటువంటి ఆధారాలను భారత్‌తో పంచుకోలేదని విదేశాంగశాఖ వెల్లడించింది. ఇప్పటికే తాము పలు మార్లు ఆ దేశ సర్కారును అభ్యర్థించామని వెల్లడించింది. రాజకీయ లబ్ధికోసమే తాజాగా ఎటువంటి ఆధారాలు లేకుండా భారత్‌పై విమర్శలు చేస్తున్నట్లుందని ఆగ్రహం వ్యక్తం చేసింది.ఆ దేశ ప్రధాని ట్రూడో 2018 నుంచే భారత్‌తో ఘర్షణాత్మక వైఖరిని అవలంభిస్తున్నట్లు ఆధారాలున్నాయ విదేశాంగ శాఖ ప్రకటనలో పేర్కొంది. భారత్‌లో వేర్పాటువాదాన్ని ఎగదోసేవారిని ఆయన మంత్రి వర్గంలో చేర్చుకొనడాన్ని గుర్తుచేసింది. దీనికి తోడు 2020లో భారత రాజకీయాల్లో ట్రూడో నేరుగా జోక్యం చేసుకొనే యత్నం చేశారంది. భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మకు 36 ఏళ్ల దౌత్య అనుభవం ఉందని విదేశాంగశాఖ వెల్లడించింది.ఆసియాన్ సమావేశాల సందర్భంగా లావోస్‌లో భారత ప్రధాని మోదీ, కెనడా ప్రధాని ట్రూడో భేటీ అయినట్టు సమాచారం. అయితే ఇరువురి మధ్య ఎటువంటి చర్చలు జరగలేదని భారత్ స్పష్టంచేసింది. కేవలం వారిద్దరూ ఎదురుపడ్డారని భారత్ అధికారులు తెలిపారు. అక్కడ భారత వ్యతిరేక కార్యకలాపాలపై కెనడా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునేవరకు, పరిస్థితి సాధారణస్థితికి చేరుకోవడం కష్టం" అని అప్పట్లోనే విదేశాంగశాఖ వర్గాలు పేర్కొన్నాయి.

# అర్థశాస్త్రంలో ముగ్గురికి నోబెల్



అర్థశాస్త్రంలో విశేష కృషి చేసినందుకు ముగ్గురికి నోబెల్ బహుమతి లభించింది అర్థశాస్త్రంలో ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారాన్ని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. 2024 సంవత్సరానికి గాను ముగ్గురికి దీనిని అందించనుంది. దేశాల మధ్య సంపదలో అసమానతలపై పరిశోధనలకుగానూ డారెన్ ఏస్‌మోగ్లు, సైమన్ జాన్సన్, జేమ్స్ ఎ. రాబిన్‌సన్ ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.వైద్యవిభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రకటన ఈ రోజుతో ముగిసింది. గత సోమవారం వైద్యశాస్త్రంలో విజేతలను ప్రకటించగా.. తర్వాత వరుసగా భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, సాహిత్యం విభాగాల్లో పురస్కారాలను ప్రకటించారు. శుక్రవారం రోజున నోబెల్ శాంతి బహుమతి (2024)పై ప్రకటన చేయగా.. తాజాగా అర్థశాస్త్రంలో ముగ్గురు ఆర్థికవేత్తల పేర్లను వెల్లడించారు. డారెన్, సిమోన్.. అమెరికాలో కేంబ్రిడ్జ్‌లోని మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందినవారు కాగా.. షికాగో యూనివర్సిటీలో రాబిన్‌సన్ పరిశోధనలు చేస్తున్నారు. స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్త, ఇంజినీర్, వ్యాపారవేత్త ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరు మీదుగా ప్రపంచంలో వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తోన్న సంగతి తెలిసిందే. 1896లో ఆల్‌ఫ్రెడ్ నోబెల్ మరణించగా.. 1901 నుంచి ఆయన ట్రస్ట్ ద్వారా ఈ అవార్డులను ఏటా ప్రదానం చేస్తున్నారు. అవార్డు గ్రహీతలకు 11 మిలియన్ల స్వీడిష్ క్రోనర్ నగదు అందుతుంది. డిసెంబర్ 10న నిర్వహించే కార్యక్రమంలో గ్రహీతలకు అవార్డులను అందజేస్తారు.

# అదో కవలల ప్రపంచం.. అక్కడ 50 శాతం ప్రసవాల్లో ట్విన్సే..!





కవలల ప్రపంచంగా పేరున్న నైజీరియాలోని ఇగ్బా ఓరాలో ఘనంగా ట్విన్స్ ఫెస్టివల్ మొదలైంది. ఈ సందర్భంగా ఒకే దుస్తుల్లో కనిపించిన చిన్నారులు, పెద్దలు సందడి చేశారు. నైజీరియా నైరుతి ప్రాంతంలోని ఇగ్బా ఓరా అనే ఊళ్లో ఎక్కడ చూసినా.. ఒకటే రకం దుస్తులను ఇద్దరిద్దరు వేసుకొని కనిపిస్తారు. ఎందుకంటే వారు కవలలు..! ఆ వూరిపేరు ఇగ్బో-ఓరా. ఇక్కడ ఏటా నిర్వహించే వరల్డ్ ట్విన్ ఫెస్టివల్ మొదలైంది. ఈ సందర్భంగా ఓయో స్టేట్ గవర్నర్ సేయి మకిండే మాట్లాడుతూ దేశంలో పర్యటకాన్ని ప్రోత్సహించేందుకు, యునెస్కో వరల్డ్ హెరిటేజ్ గుర్తింపు సాధించేందుకు తమ ప్రయత్నాలు కొనసాగుతాయన్నారు. ఈ ఊళ్లో అత్యధిక మంది కవలలే. చాలా తక్కువగా ఒక్కరు జన్మిస్తారని చెబుతుంటారు.కవలల్లో కూడా ముందు పుట్టిన వారికి 'తైవో' అని పేరు పెడతారు.. 'ముందుగా ప్రపంచాన్ని అనుభూతి చెందిన' అని అర్థం. అదే తర్వాత పుడితే కెహిండే అనే పేరుపెడతారు. 'తర్వాత వచ్చిన వారు' అని దాని భావం. ఇక్కడి ప్రజలు ఆహారంలో బెండ ఆకుతో చేసిన ఒక రకమైన సూప్‌ను, యమ్ అనే దుంపతో చేసిన పిండిని వాడుతుంటారు. కానీ, వీరి ఆహారానికి కవలలు జన్మించడానికి ఏ సంబంధం లేదని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రతి 1,000 ప్రసవాల్లో 12శాతం కవలలు ఉంటారు. కానీ, ఇగ్బో-ఓరాలో మాత్రం ఇది 50శాతం ఉందని వైద్యశాలల రికార్డులు చెబుతున్నాయి. దీంతో ఈ ప్రాంతానికి పర్యటకులు కూడా ఎక్కువగానే వస్తుంటారు. ఫెస్టివల్స్ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు, టాలెంట్ షోలు, రాయల్ విజిట్‌లు జరిగాయి. ఈ ఫెస్టివల్స్ నిర్వహకులు కూడా కవలలే కావడం విశేషం. దీనికి వచ్చిన వారిలో చాలా మంది కవలలు స్టాండ్స్‌లో కూర్చొని వేడుకలను వీక్షించారు. ఫెస్టివల్స్‌లో మ్యాచింగ్ దుస్తులు, హ్యాండ్ బ్యాగ్‌లు, సన్‌గ్లాసెస్ ధరించి కనిపించడం ఆకర్షణీయంగా నిలిచింది.

# త్వరలో దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేస్తాం: మంత్రి సీతక్క

దివ్యాంగులు కంపెనీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని మంత్రి సీతక్క తెలిపారు.దివ్యాంగుల జాబ్ పోర్టల్‌ను ఆమె ఆవిష్కరించారు. మహిళా సంక్షేమ శాఖలో 10 మందికి నియామక ఉత్తర్వులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగులు జాబ్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుంటే అర్హత ప్రకారం ఉద్యోగాలు వస్తాయన్నారు. సంక్షేమ నిధుల్లో వారికి ఐదు శాతం కేటాయిస్తున్నామని చెప్పారు. ప్రైవేటు ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇతర పథకాల్లోనూ రిజర్వేషన్లు ఉన్నాయన్నారు. దివ్యాంగుల పరికరాల కోసం బడ్జెట్‌లో రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. త్వరలో వారికి సంబంధించిన బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేస్తామని సీతక్క తెలిపారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం అక్టోబర్ 15 2024

# జిల్లా విద్యాధికారి ప్రకటన


తేది: 14.10.2024

పత్రికా ప్రకటన

DSC -2024 ఉపాధ్యాయ ఎంపిక పరీక్ష ద్వారా ఎంపిక చేయబడి, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో రిపోర్ట్ చేసిన ఉపాధ్యాయులకు తేదీ: 15.10.2024 రోజున సినారె కళామందిరం, సిరిసిల్లలో కౌన్సిలింగ్ ద్వారా పాఠశాలలు కేటాయించబడును. కావున ఎంపిక కాబడిన ఉపాధ్యాయులు ఉదయం 10.00 గంటల వరకు కౌన్సిలింగ్ కు హాజరు కాగలరని జిల్లా విద్యాధికారి ఏ రమేష్ కుమార్ గారు ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా విద్యాశాఖ అధికారి,
రాజన్న సిరిసిల్ల.

**రాజన్నసిరిసిల్లజిల్లా సిరిసిల్ల అక్టోబర్ 14 కరపత్రం**
DSC -2024 ఉపాధ్యాయ ఎంపిక పరీక్ష ద్వారా ఎంపిక చేయబడి, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో రిపోర్ట్ చేసిన ఉపాధ్యాయులకు తేదీ: 15.10.2024 రోజున సినారె కళామందిరం, సిరిసిల్లలో కౌన్సిలింగ్ ద్వారా పాఠశాలలు కేటాయించబడును. కావున ఎంపిక కాబడిన ఉపాధ్యాయులు ఉదయం 10.00 గంటల వరకు కౌన్సిలింగ్ కు హాజరు కాగలరని జిల్లా విద్యాధికారి ఏ రమేష్ కుమార్ గారు ఒక ప్రకటనలో తెలిపారు జిల్లా విద్యాశాఖ అధికారి,

# ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం....

- 100రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రజలను నట్టేట మోసం చేసింది..
- 300 రోజులైనా ఆరు గ్యారంటీలకు అతి గతి లేకుండా పోయింది...
- ప్రజాపాలన దరఖాస్తులెన్ని పరిష్కరించారు..?
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...

**కరీంనగర్ అక్టోబర్ 14 కరపత్రం**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 300 రోజులు గడిచిన , ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, ముఖ్యంగా వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం నేడు ప్రజానీకాన్ని తీవ్రంగా మోసం చేసి, ప్రజల వ్యతిరేకతను మూట గట్టుకుంటుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు. సోమవారం రోజున వీణవంక మండలంలోని పలు గ్రామాల్లో బిజెపి మెంబర్షిప్ డ్రైవ్ కార్యక్రమం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బిజెపి మెంబర్షిప్ డ్రైవ్ ముగింపుకు సమయం దగ్గర పడిందని , వీణవంక మండలంలోని నాయకులు , కార్యకర్తలందరూ



మెంబర్షిప్ డ్రైవ్ ప్రోగ్రాంను సక్సెస్ చేయాలన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజలకు వివరించి , బిజెపి సభ్యత్వ నమోదులో అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యం అయ్యేలా చూడాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కోసం అన్ని వర్గాల ప్రజల ఓట్లను దండుకోవడానికి 420 హామీలను, రకరకాల డిక్లరేషన్లతో ప్రజలను మభ్య పెట్టే రీతిలో మేనిఫెస్టోను రూపొందించిందన్నారు. అధికారంలోకి వచ్చి 300 రోజులు గడిచిన మేనిఫెస్టో లో ని అంశాలను నెరవేర్చకుండా దాటవేతధోరణి అవలంబిస్తుందన్నారు. ముఖ్యంగా సీజన్ ముగిసిన రైతు భరోసా సహాయం అందించలేదని, రెండు లక్షల రుణమాఫీ రైతులందరికీ వర్తించలేదన్నారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగుల భర్తీ కార్యక్రమం అటకెక్కిందన్నారు. వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్లను పెంచలేదని, మహిళలకు ఇస్తామన్న రూ.2500 నేటికీ అందించకుండా అర్హులైన మహిళలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. అనేక చెప్పుకుంటూ వెళితే కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా చెప్పిన ఏ ఒక్క హామీని సక్రమంగా నెరవేర్చలేదని ఆయన ఆరోపించారు. హామీలను అమలు కోసం ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరించి నెలలు గడిచిపోయిందని, వాటినీ ఎందుకు స్వీకరించిందో..? దరఖాస్తుల పరిస్థితి ఏంటో ...? తెలియని పరిస్థితి ఉందన్నారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రోజుకో రాజకీయడ్రామా చేస్తుందన్నారు. ఇష్యూ డైవర్ట్ పాలిటిక్స్ కు, టైంపాస్ రాజకీయాలకు కాంగ్రెస్ అలవాటు పడిపోయిందన్నారు. కులగణన పేరిట రేవంత్ రెడ్డి ప్రభుత్వం మళ్లీ ఓ డ్రామా చేస్తుందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రామిడి ఆదిరెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు జిల్లా సభ్యత్వ నమోదు కో కన్వీనర్ చెన్నమధవుని నర్సింహ రాజు మండల ప్రధాన కార్యదర్శి సదానందం నాయకులు గణపతి సారయ్య ఎంపీటీసి మోరే స్వామి బూత్ అధ్యక్షులు సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# గంగిశెట్టి రంజిత్ జమ్మికుంటవాసికి డాక్టరేట్

- అందజేసిన జవహార్ లాల్ నెహ్రూ కృషి విశ్వవిద్యాలయం
- "నువ్వులలో జన్యుపరమైన అంచనా" అనే అంశంపై పీహెచ్ డీ

**జమ్మికుంట, అక్టోబర్ 14 కరపత్రం**
జమ్మికుంట పట్టణానికి చెందిన గంగిశెట్టి రంజిత్ కుమార్‌కు మధ్యప్రదేశ్ లోని జబల్‌పూర్ జవహార్ లాల్ నెహ్రూ కృషి విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. దిగువ మధ్య తరగతి చిరు వ్యాపారి కుటుంబానికి చెందిన రంజిత్ కుమార్.."నువ్వులలో జన్యుపరమైన అంచనా" అనే అంశంపై పీహెచ్‌డీ చేశారు.గంగిశెట్టి స్వరూపరాణి - రవీందర్..దంపతుల మూడో సంతానం రంజిత్ కుమార్.. చిన్నప్పటి నుంచి చదువుల్లో రాణిస్తున్నారు. పిల్లల చదువు నిమిత్తం తల్లిదండ్రులు స్వరూపారాణి రవీందర్.. తమ సొంతూరు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలకేంద్రం నుంచి జమ్మికుంట పట్టణానికి తమ నివాసాన్ని మార్చుకున్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని చిన్ననాటి నుంచి గమనించిన రంజిత్.. ఉన్నత చదువులు చదివి ప్రయోజకుడై లెక్చరర్‌గా ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం శ్రీకృష్ణదేవరాయల ఉద్యాన వన కాలేజీలో ఉద్యోగం చేస్తున్నారు. తాజాగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. తమ కుమారుడు డాక్టరేట్ సాధించడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.మొగుళ్లపల్లి,జమ్మికుంట లో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసిన రంజిత్.. ఇంటర్..వరంగల్ లో, డిగ్రీ.. హైదరాబాద్ లోని కొండా లక్ష్మణ్ ఉద్యాన వర్సిటీ, పీజీ..పశ్చిమ బెంగాల్ లోని విశ్వభారతి విశ్వ విద్యాలయంలో కంప్లీట్ చేశారు. పీ హెచ్ డీ ని..జవహార్ లాల్ నెహ్రూ కృషి విశ్వవిద్యాలయంలో..'డార్క్ బ్రౌన్ సెసామె జెనెటిక్ అసెస్‌మెం ట్' అనే అంశంపై ప్రొఫెసర్ రజని బిసెన్ మార్గదర్శనంలో రంజిత్ కుమార్ తన రీసెర్చ్ కొనసాగించారు. ఇటీవల జరిగిన స్నాతకోత్సవంలో జవహార్ లాల్ నెహ్రూ కృషి విశ్వవిద్యాలయంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్(వీసీ) ప్రొఫెసర్ పీ కే మిశ్రా డాక్టరేట్ ను



ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ ను తోటి స్నేహితులు, విద్యార్థులు, బంధు మిత్రులు, మొగుళ్లపల్లి గ్రామస్తులు, జమ్మికుంట పట్టణవాసులు అభినందిస్తున్నారు. డాక్టరేట్ పట్టా పొందిన ఉన్నత విద్యావంతుడైన రంజిత్ భవిష్యత్‌లో మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రమాద వశత్తు కుంటలో పడి వ్యక్తి మృతి



**వర్గర్ అక్టోబర్ 14, కరపత్రం**
దశ దిన కార్యక్రమానికి వెళ్ళి అంసోనీ కుంటలో కి స్నానం చేయడానికి కుంట దగ్గరికి వెళ్ళగా ప్రమాదవశాత్తూ కాలు జారీ కుంట లో పడి శ్వాస ఆడక మృతి చెందినట్లు ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలిపారు గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి కథనం ప్రకారం ఆదివారం నాడు తునకిమక్త గ్రామానికి చెందిన సుందు రాములు తండ్రి సాయిలు, వయస్సు:(58 )వారి పాలివారు ఆయన సుందు ఎల్లమ్మ దశ దిన కార్యక్రమానికి వెళ్ళి సాయంత్రం వూరి శివారు లో గల అంసోనీ కుంట కి స్నానం చేయడానికి వెళ్లారు. రాత్రి వరకి తిరిగి రాకపోయే సర్కి సొమవారం ఉదయం 0500 గంటలకి అంసోనీ కుంట లో వేతకగా రాములు శవం దొరికినది. మృతుడు స్నానం చేయడానికి అని కుంట ధగగరికి వెళ్ళగా ప్రమాదవశాత్తూ కాలు జారీ కుంట లో పడి శ్వాస ఆడక మృతి చెందినాడు. ఇట్టి విషయం కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు ప్రమాదవశాత్తూ మరణం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనైనది.

# బౌరంపేటలో వీధి కుక్కల స్వైర విహారం

- వీధి కుక్కల దాడి లో తండ్రి, కొడుకులకు గాయాలు



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 14కరపత్రం**
దుండిగల్ మున్సిపాలిటీలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇక్కడ కుక్కలు గుంపులు, గుంపులుగా రోడ్లపై తిరుగుతూ చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు , సైకిల్, ద్విచక్రవాహనదారులను వెంబడించి పరుగుపెట్టిస్తున్నాయి. వీధికుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రాత్రివేళల్లో రోడ్లపైకి గుంపులు గుంపులుగా వచ్చి రోడ్లపై నుంచి వెళ్ళే వారిపై దాడులు చేస్తుండడంతో కుక్కలు కనబడితే చాలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేట్ లో ఆదివారం రాత్రి పనిమీద బయటకు వెళ్లిన కుమ్మరి మల్లయ్య, కుమారుడిని తీసుకొని ఇంటికి వస్తుండగా వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. నెల రోజుల క్రితం ఇదే గ్రామంలో బాలుడి పై కుక్కల దాడి మరవకముందే మరో సారి వీధి కుక్కల స్వైర విహారం చేయటం పై స్థానికులు అధికారులపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి వీధి కుక్కల బెడద లేకుండా చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.....

# యాదాద్రి తరహాలో వేములవాడ ఆలయ అభివృద్ధికి చర్యలు :: రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

- రాజన్న ఆలయ అభివృద్ధి పై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి
- భక్తుల సౌకర్యార్థం అవసరమైన అన్ని వసతులు కల్పిస్తాం
- ఆలయానికి బంగారు తాపడం, వెండితో బయట పల్లకి ఉత్సవమూర్తుల తయారీకి ప్రణాళికలు
- రాజన్న సన్నిధిలో మంత్రి మనవడి పుట్టి వెంట్రుకల కార్యక్రమం




**కరీంనగర్ అక్టోబర్ 14 కరపత్రం**
వేములవాడ ఆలయాన్ని సందర్శించి స్వామి వారిని కుటుంబ సభ్యుల తో దర్శించుకున్న మంత్రి కొండ సురేఖ యాదాద్రి తరహాలో వేములవాడ ఆలయాన్ని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు.సోమవారం వేములవాడ పట్టణంలో పర్యటించిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ , ఎస్పీ అఖిల్ మహజన్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.వేములవాడ రాజన్న ఆలయం అర్చకులు పూర్ణకుంభంతో మంత్రికి ఆలయంలోకి స్వాగతం పలికారు. వేద పండితుల ఆశీర్వాదం అందించారు. మంత్రి స్వామివారి దర్శనం చేసుకుని కోడే మొక్కలు చెల్లించారు. రాజన్న దేవాలయం సన్నిధిలో మనవడి పుట్టి వెంట్రుకల కార్యక్రమాన్ని మంత్రి కుటుంబ సభ్యుల తో పూర్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాజన్న దేవాలయ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, త్వరలోనే రాజన్న దేవాలయ అభివృద్ధి పై సీఎం స్థాయిలో అత్యున్నత సమావేశం జరుగుతుందని, శాస్త్రాల ప్రకారం ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని అన్నారు.భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని రకాల వసతులను కల్పిస్తూ ఆలయ అభివృద్ధికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నామని, స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సైతం ఆలయ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారని అన్నారు.యాదాద్రి తరహాలో వేములవాడ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, యాదాద్రి ఆలయానికి 63 కేజీల బంగారంతో తాపడం ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. వేములవాడ దేవాలయం వద్ద 65 కేజీల బంగారం 5000 కిలోల వెండి అందుబాటులో ఉందని వీటిని వినియోగించుకొని వేములవాడ ఆలయానికి సైతం బంగారు తాపడం, వెండితో పల్లకీలు, ఉత్సవ విగ్రహాలు రూపొందించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని మంత్రి తెలిపారు.అనంతరం మంత్రి బద్ది పోచమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ పర్యటనలో మంత్రి వెంట ఆలయ ఈ.ఓ. వినోద్ రెడ్డి, వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ మహేష్, అర్.డి. ఓ. రాజేశ్వర్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

# ఎంబీబీఎస్ విద్యార్థిని చదువుకి బాసటగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి

- మాజీ మంత్రి బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కేటీఆర్ చేతుల మీదుగా చెక్కు అందజేత



**ఉప్పల్ కరపత్రం ప్రతినిధి:-**
చర్లపల్లి డివిజన్ మధు సుధన్ రెడ్డి కాలనీకి చెందిన లింగోజీ రమేశ్ - మంగమ్మ కుమార్తె తేజ శ్రీ కొత్త గూడం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించింది.ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఉప్పల్ శాసనసభ్యుడు బండారు లక్ష్మారెడ్డి తన స్వంత నిధులతో బి ఎల్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్ కి అయ్యే ఫీజు 29,000/- రూపాయల చెక్కును కేటీఆర్ చేతుల మీదుగా చెక్కు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఎవరైనా ఎంబీబీఎస్ సీటు సాధిస్తే ఫీజు మొత్తం తానే చెల్లిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో చర్లపల్లి డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం

- నియోజకవర్గం కన్వీనర్ గా ఎడ్ల జోగిరెడ్డి

**తిమ్మాపూర్, అక్టోబర్ 14 కరపత్రం**
తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మానకొండూరు నియోజకవర్గ కన్వీనర్ గా ఎడ్ల జోగిరెడ్డి నియామకం.కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కేంద్రానికి చెందిన ఎడ్ల జోగి రెడ్డి గత రెండు దశాబ్దాల క్రితం తెలంగాణ ఉద్యమం పోరాటంలో చురుకైన పాత్ర పోషించారు. ఉద్యమ పోరాట సమయంలో అనేక మంది మహానేతలు, నాయకులతో కలిసి ఉద్య మంలో పాల్గొని చురుకైన పాత్ర పోషించారు. తెలం గాణ ఉద్యమంలో ఎడ్ల జోగిరెడ్డి చేసిన సేవలను గుర్తించిన రాష్ట్ర తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కన్వీనర్ చీమ శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మానకొండూరు నియోజక వర్గం కన్వీనర్ గా ఎడ్ల జోగి రెడ్డిని నియామకం చేసినట్లు సోమవారం పత్రిక ప్రకటనలు ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఎడ్ల జోగిరెడ్డి మాట్లాడుతూ...నా నియామకానికి సహకరించిన ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్, ముఖ్య సలహాదారుడు ఓరుగంటి



ఆనంద్, జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి లతో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, రాష్ట్ర నాయకు లకు, జిల్లా బాధ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యమం పుట్టి దాదాపు 23 ఏళ్లు పూర్తిగా అయ్యింది అని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత అధికారం చేపట్టిన టిఆర్ఎస్ ప్రభుత్వం అస లైన తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరులు వారి కుటుంబాలను విస్మరించిందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులు, అమరవీరులు, ఉద్యోగ సంఘాలతో పాటు కుల,మతాలకతీతంగా సబ్బండ వర్గాల పోరాటంతోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైంది అన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత మొదటిసారి అధికారం చేపట్టిన టిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమంలో చురు కైన పాత్ర పోషించిన మహానేతలు, అమరవీరులు, ఉద్యమ నాయకులు, కార్యకర్తలు, జర్నలిస్టులను విస్మరించిందన్నారు. దాని ఫలితమే ఇటీవల టి ఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయిందని అన్నా రు. కనీసం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తెలం గాణ ఉద్యమ పోరాటంలో పాల్గొన్న ఉద్యమకారులు, అమరవీరులు వారి కుటుంబాలు, నాయకులను, కార్యకర్తలను, జర్నలిస్టులను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యత ఇచ్చి,అన్ని రకాలుగా సహాయ, సహకా రాలు అందజేయాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

**భువనగిరికరపత్రం -**
తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ని, హైదరాబాద్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, టీపీసీసీ జనరల్ సెక్రటరీ జనగామ ఉపేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



# స్టార్ హీరో మూవీల సందడి

## దసరాతో టీజర్లు, పోస్టర్ల విడుదల

దసరా సందర్భంగా పలు సినిమాల టీజర్‌లు విడుదలయ్యాయి. ఇందులో విశ్వంభర ముందుంటుంది. విర్రవీగుతున్న అరాచకానికి ముగింపు పలికే మహాయుద్ధం ఏ రూపంలో వచ్చిందో తెలియాలంటే 'విశ్వంభర' చూడాల్సిందే. చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిది. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు. కునాల్ కపూర్ ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. వశిష్ఠ దర్శకుడు. యు.వి.క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ ఉప్పలపాటి నిర్మాతలు. విక్రమ్ రెడ్డి సమర్పకులు. ఈ సినిమా టీజర్‌ని దసరా సందర్భంగా విడుదల చేశారు. 'విశ్వాన్ని అలుముకున్న ఈ చీకటి విస్తరిస్తున్నంత మాత్రాన వెలుగు రాదని కాదు. ప్రశ్నలు పుట్టించిన కాలమే సమాధానాన్ని కూడా సృష్టిస్తుంది' అంటూ మొదలయ్యే టీజర్‌లో విజువల్ ఎఫెక్ట్స్‌కి పెద్దపీట వేశారు. సోషియో ఫాంటసీ కథతో రూపొందుతున్న చిత్రమిది. అనుకున్నట్టుగానే ఈ సినిమా విడుదలని, రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' కోసం వాయిదా వేశారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన 'గేమ్ ఛేంజర్' సంక్రాంతి సందర్భంగా విడుదల కానుంది. ముందుగా ఈ సినిమాని క్రిస్మస్‌కు విడుదల చేయాలనుకున్న విషయం తెలిసిందే. కానీ పంపిణీదారుల కోరిక మేరకు సంక్రాంతికి వాయిదా వేస్తున్నట్టు నిర్మాత దిల్‌రాజు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా నిర్మాణంలో ఉన్న భారీ బ్జడెట్ చిత్రమిది. అంచనాలున్న ఇలాంటి సినిమాలు క్రిస్మస్ కంటే సంక్రాంతికి వస్తేనే బాగుంటుందని నాతో సహా పంపిణీదారులంతా భావించాం. ఇదే విషయాన్ని కథానాయకుడు చిరంజీవితోనూ, యు.వి.క్రియేషన్స్ నిర్మాతలు వంశీ, ప్రమోద్, విక్రమ్‌తోనూ పంచుకున్నాం. వాళ్లు సానుకూలంగా స్పందించి, సంక్రాంతికి విడుదల చేయాలనుకున్న 'విశ్వంభర'ని వాయిదా వేశారు. 'గేమ్ ఛేంజర్' కోసం వాళ్లు తీసుకున్న ఈ నిర్ణయానికి కృతజ్ఞతలు' అన్నారు. శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'గేమ్ ఛేంజర్' వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. ఇందులో రామ్‌చరణ్‌కి జోడీగా కియారా అద్వాణీ నటించారు. ఇకపోతే బాలకృష్ణ 109వ చిత్రం సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. బాబీ కొల్లి దర్శకత్వంలో... సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ సినిమా పేరుతోపాటు, టీజర్‌ని దీపావళికి విడుదల చేయనున్నట్టు చిత్రబృందం తెలిపింది. దసరా సందర్భంగా ఓ పోస్టర్‌ని విడుదల చేశారు. అందులో బాలకృష్ణ గుర్రంపై స్వారీ చేస్తూ, రాజసంతో కనిపించారు.



బాలకృష్ణ శైలి మాస్, యాక్షన్ అంశాలతో రూపొందుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు బాబీ దేవోల్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాలకృష్ణ – బోయపాటి శ్రీను మరోసారి చేతులు కలుపుతున్నారు. విజయవంతమైన ఈ కలయికలో నాలుగో చిత్రం ఈ నెల 16న ప్రారంభం కానుంది. 'సింహా', 'లెజెండ్', 'అఖండ' తర్వాత రూపొందుతున్న ఈ సినిమాని 14 రీల్స్ ప్లస్, ఎమ్.తేజస్విని నందమూరి సమర్పిస్తున్నారు. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మాతలు. ఇకపోతే పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'హరిహర వీరమల్లు' పనులు చకచకా సాగుతున్నాయి. ఇటీవలే ఈ సినిమా చిత్రీకరణ పునః ప్రారంభమైన సంగతి తెలిసిందే. హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్ నిక్ పావెల్ నేతృత్వంలో భారీ యుద్ధ సన్నివేశాల్ని తెరకెక్కించారు. ఈ నెల 14 నుంచి మరో షెడ్యూల్ ఆరంభం కానుంది. ఈ సినిమా కోసం పవన్‌కల్యాణ్ ఓ పాట పాడారు. ఆ పాటని త్వరలోనే విడుదల చేయనున్నట్టు సినీ వర్గాలు తెలిపాయి. దసరా సందర్భంగా ఓ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. నవంబరు 10 నాటికి చిత్రీకరణ పూర్తి చేసుకోనున్న ఈ సినిమాలో పవన్‌కల్యాణ్ సరసన నిధి అగర్వాల్ నటిస్తున్నారు. జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఎ.దయాకర్ రావు నిర్మాత. ఎ.ఎం.రత్నం సమర్పకులు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ సినిమాలోని తొలి భాగం మార్చి 28న తెలుగుతోపాటు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఇకపోతే విజయవంతమైన 'దసరా' తర్వాత ఆ కలయికలో మరో చిత్రం శనివారం మొదలైంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాని ఎస్.ఎల్.వి.సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. 'దసరా' సినిమాలోనే నానిని మాస్ అవతారంలో చూపించిన దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, ఈసారి మరో కొత్త రకమైన పాత్రని తీర్చిదిద్దారని, వీరోచితంగా కనిపించే ఆ పాత్ర కోసం నాని ప్రత్యేకంగా సన్నద్ధమవుతున్నారని సినీ వర్గాలు తెలిపాయి. నాని కెరీర్‌లోనే అత్యధిక వ్యయంతో రూపొందుతున్న ఈ సినిమా, 'దసరా' చిత్రం కంటే వంద రెట్లు అధికంగా ప్రభావం చూపిస్తుందని చిత్రబృందం ఓ ప్రకటనలో తెలిపింది. కథానాయకుడు రామ్ పోతినేని 22వ చిత్రం మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై తెరకెక్కనుంది. దసరా సందర్భంగా శనివారం ఈ సినిమాని అధికారికంగా ప్రకటించింది నిర్మాణ సంస్థ. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ఫేమ్ మహేశ్‌బాబు పచ్చిగొల్ల ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. 'రామ్ కెరీర్‌లో ఓ మైలురాయిలా నిలిచే చిత్రమిది. ఈమధ్య కాలంలో యాక్షన్ ప్రధానమైన సినిమాల్లో ఎక్కువగా నటించిన రామ్ ఇందులో ఓ విభిన్నమైన పాత్రలో సందడి చేస్తారు. సున్నితంగా హృదయాల్ని స్పృశించే అంశాలు, భావోద్వేగాలున్న ఈ కథని దర్శకుడు తీర్చిదిద్దిన విధానం చాలా బాగుంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభిస్తామని సినీ వర్గాలు తెలిపాయి. 'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్' తర్వాత సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా మరో చిత్రాన్ని నిర్మిస్తోంది. 'కోహినూర్' పేరుతో రూపొందుతున్న ఈ చిత్రానికి రవికాంత్ పేరేపు దర్శకుడు. ఇదివరకు ఆయన... సిద్ధుతో కలిసి 'కృష్ణ అండ్ హిజ్ లీల' తెరకెక్కించారు. ఈసారి కోహినూర్ వజ్రాన్ని తిరిగి తీసుకురావడం అనే అంశం ఆధారంగా సోషియో ఫాంటసీ కథతో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. దసరా సందర్భంగా ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. అమర్‌దీప్, లిషి గణేశ్ కల్లపు జంటగా సాయివర్మ దాట్ల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'నా నిరీక్షణ'. చైతన్యవర్మ, రమ్య ప్రియ కీలక పాత్రలు పోషిస్తున్నారు. పి.సంతోష్ రెడ్డి నిర్మాత. ఈ చిత్రం విజయ దశమి రోజున హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నిర్మాత దిల్‌రాజు క్లాప్‌నివ్వగా, రాజా రవీంద్ర స్క్రిప్ట్ అందజేశారు. నిర్మాత గణపతి రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేశారు. నిర్మాత సురేశ్‌బాబు, నటుడు రాజా రవీంద్ర తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దర్శకుడు మాట్లాడుతూ రెండు జంటల చుట్టూ సాగే కథ ఇది. తప్పకుండా ప్రేక్షకులకు మంచి అనుభవాన్ని పంచుతామన్నారు. పాత, కొత్తతరం నటుల మేళవింపుతో సీనియర్ దర్శకుడు పి.సునీల్‌కుమార్ రెడ్డి తెరకెక్కిస్తున్న చిత్రం 'కాక్రోచ్'. విశాఖపట్నం నేపథ్యంలో సాగే ఓ ప్రేమకథతో దీన్ని రూపొందిస్తున్నారు. విజయదశమి సందర్భంగా సినిమా పేరుని, ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ కథాంశం విభిన్నంగా ఉంటుందని, ఈ కథకి 'కాక్రోచ్' అనే పేరు ఎందుకు పెట్టామన్నది తెరపైనే చూడాలన్నారు దర్శకుడు.

## కంగువా డబ్బింగ్‌లో ఏఐ ఉపయోగం

### నిర్మాత కేఈ జ్ఞానవేల్ ఆసక్తికర విషయం వెల్లడి



సూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'కంగువా' శివ దర్శకత్వంలో రూపొందుతుంది. నవంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఫాంటసీ యాక్షన్ ఫిల్మ్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా గురించి నిర్మాత కేఈ జ్ఞానవేల్ ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తాజాగా ఎక్స్ వేదికగా నెటిజన్లతో ముచ్చటించిన ఆయన 'కంగువా'లో ఏఐని ఉపయోగించినట్లు చెప్పారు. 'కంగువా'ను ఏకంగా 8 భాషల్లో ఒకేసారి రిలీజ్ చేయనున్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన నిర్మాత ఓ విషయం పంచుకున్నారు. తమిళ వెర్షన్‌కు సూర్య డబ్బింగ్ చెప్పగా.. మిగతా భాషల్లో ఏఐ సాయంతో డబ్బింగ్ పనులు పూర్తి చేయనున్నాం. డబ్బింగ్ పనుల కోసం కోలీవుడ్‌లో ఏఐని ఉపయోగించడం ఇదే తొలిసారి. ఇటీవల విడుదలైన 'వేట్టయన్'లో అమితాబ్‌బచ్చన్ వాయిస్‌లో మార్పుల కోసం ఏఐను ఉపయోగించారు. ఇప్పుడు పూర్తిగా డబ్బింగ్ కోసం మేం దీన్ని ప్రయోగిస్తున్నాం. ఇది విజయవంతమవుతుందని భావిస్తున్నాం. ఈ చిత్రం అన్ని ప్రధాన భారతీయ భాషలతో పాటు ఇంగ్లిష్, ఫ్రెంచ్, స్పానిష్‌లలో విడుదల కానుంది. చైనీస్, జపనీస్ విడుదల తేదీలను కూడా త్వరలోనే ప్రకటిస్తాం అని నిర్మాత జ్ఞానవేల్ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం రూ.1000 కోట్ల కలెక్షన్స్ చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు నిర్మాత ఇటీవల చెప్పారు. పార్ట్ 2, పార్ట్ 3 కథలు సిద్ధంగా ఉన్నాయని.. పార్ట్ 1 విజయం ఆధారంగా వాటిని తెరకెక్కించేలా ప్లాన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ సినిమా సూర్యని మరో స్థాయికి తీసుకెళ్తుందని నమ్ముతున్నట్లు చెప్పారు. యాక్షన్‌తోపాటు ఎమోషన్స్‌కు ఇందులో అధిక ప్రాధాన్యం ఉందన్నారు. త్రీడీలోనూ అలరించనున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. కంగ అనే ఓ పరాక్రముడి కథతో ఈ సినిమా సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇందులో సూర్య ఆరు భిన్నమైన అవతారాల్లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. దిశా పఠానీ కథానాయిక. బాబీ దేవోల్ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. జగపతి బాబు, యోగిబాబు, కోవై సరళ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# కెరీర్ ప్రారంభంలో అనేక ఒడిదుడుకులు

## ప్రభాస్ మూవీలో నా బదులు కాజల్ ఎంపిక

## అలనాటి విషయాలను పంచుకున్న నటి రకుల్



ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చి గుర్తింపు తెచ్చుకున్నారు నటి రకుల్ ప్రీత్ సింగ్. తన కెరీర్ ప్రారంభంలో ఎన్నో అవకాశాలు కోల్పోయానని చెప్పిన రకుల్.. గతంలో ప్రభాస్ సినిమా నుంచి తనను తొలగించడం గురించి మరోసారి మాట్లాడారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రభాస్ సినిమాలో తన స్థానంలో కాజల్‌ను తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రభాస్ సరసన ఓ సినిమాలో నాకు అవకాశం వచ్చింది. ఒక షెడ్యూల్‌ను కూడా చిత్రీకరించారు. అప్పుడు నేను దిల్లీలో చదువుకుంటున్నా. దీంతో షెడ్యూల్ పూర్తి కాగానే తిరిగి దిల్లీ వెళ్లిపోయా. అక్కడికి వెళ్లాక రెండో షెడ్యూల్ కోసం ఎన్ని రోజులైనా ఫోన్ రాలేదు. నా స్థానంలో కాజల్‌ను తీసుకున్నట్లు తర్వాత తెలిసింది. నాకు కనీస సమాచారం ఇవ్వకుండా ఆ సినిమా నుంచి తొలగించేశారు. అప్పటికే ప్రభాస్-కాజల్‌ల కాంబినేషన్‌లో ఓ సినిమా వచ్చి మంచి విజయం సాధించింది. దీంతో మరోసారి ఆ జోడి రిపీట్ అయితే బాగుంటుందని భావించిన చిత్రబృందం నన్ను తొలగించి తనను తీసుకుంది. సినిమా అనేది ఓ వ్యాపారం.. ఇందులో కొత్తగా పరిశ్రమకు వచ్చిన అమ్మాయిలకు ఇలా జరగడం సహజమే. నాకు ఎన్నోసార్లు ఇలా జరిగింది. ఒక అవకాశం పోయినా.. దానికి మించింది మన కోసం ఎదురుచూస్తుంటుందని నేను భావిస్తా అని రకుల్ చెప్పారు. గతంలోనూ రకుల్ నెపోటిజం కారణంగా తనకు అవకాశాలు రాలేదని వెల్లడించారు. సినిమా ఛాన్స్‌లు కోల్పోవడం జీవితంలో ఓ భాగం. నాకు దక్కని వాటి గురించి ఆలోచించి సమయం వృథా చేసుకోను. ఏం చేస్తే నేను వ్యక్తిగతంగా ఎదుగుతానో దానిపై శ్రద్ధ పెడతాను. ఒక స్టార్ కిడ్‌కు లభించినంత సులభంగా మిగతా వారికి ఛాన్స్‌లు రావు. అదంతా వారి తల్లిదండ్రుల కష్టం అని రకుల్ వివరించారు. ప్రస్తుతం అజయ్‌దేవగణ్ జంటగా రకుల్‌ప్రీత్ సింగ్ 'దే దే ప్యార్ దే 2'లో నటిస్తున్నారు. విజయవంతమైన 'దే దే ప్యార్ దే'కి కొనసాగింపుగా అన్షుల్ శర్మ దీన్ని తెరకెక్కిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చిలో ఇది విడుదల కానుంది.

## ప్లాస్టిక్ వాడకం తగ్గించమంటే తప్పు పడతారా

### ఎందుకింత నెగెటివీటా అంటూ అనన్న నాగళ్ల ప్రశ్న



నటి అనన్యా నాగళ్ల సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ వీడియోకు వస్తోన్న విమర్శలపై ఆమె స్పందించారు. ఎందుకింత నెగటివిటీ అంటూ అసహనాన్ని వ్యక్తంచేశారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించమని ఇటీవల నేనొక వీడియో షేర్ చేశా. దాన్ని కొందరు తప్పుబడుతూ విమర్శించారు. ఏదో చిన్న విషయం చెప్పా. నచ్చితే చేయండి.. లేకపోతే లేదు. ఎందుకింత నెగటివిటీ అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారింది. ఇటీవల ఆమె స్ట్రా లేకుండా కొబ్బరి బొండం నీళ్లు తాగుతూ కనిపించారు. సాధారణంగా నేను స్టీల్ స్ట్రా వెంట తెచ్చుకుంటాను. అది లేని పక్షంలో ఈ విధంగా కొబ్బరినీళ్లు తాగుతా. ప్లాస్టిక్ వాడకాన్ని కాస్త తగ్గిద్దాం. చిన్న చిన్న పనులే పెద్ద మార్పులకు శ్రీకారం చుడతాయని రాసుకొచ్చారు. దీనిని చూసిన పలువురు నెటిజన్లు ఆమె అభిప్రాయాన్ని తప్పుబట్టారు. 'మీ పక్కన ఉన్న ఆవిడకు ముందు చెప్పండి. ఆమె స్ట్రాతో తాగుతున్నారని కామెంట్స్ చేశారు. నెటిజన్ల కామెంట్‌లకు అనన్యా కౌంటర్ ఇచ్చారు. ఖమ్మం ప్రాంతానికి చెందిన అనన్య నాగళ్ల 2019లో విడుదలైన 'మల్లేశం'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. తొలి చిత్రంతోనే ఆదరణ సొంతం చేసుకున్నారు. 'ప్లే బ్యాక్', 'వకీల్‌సాబ్', 'శాకుంతలం' వంటి చిత్రాల్లో నటించారు. ఆమె నటించిన 'పొట్టేల్' అక్టోబర్ 25న విడుదల కానుంది.

## సందీప్ కిషన్ హీరోగా మజాకా

ఈ మధ్యన రవితేజ వరుస చిత్రాలు విడుదలైనా ఏదీ సరిగ్గా విజయం సాధించలేదు. 'ధమాకా' ఒక్కటే హిట్‌గా నిలిచి వంద కోట్ల క్లబ్‌లో చేరింది. దాంతో ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన నక్కిన త్రినాథరావు పై టాలీవుడ్‌లో హీరోలకు నమ్మకం పెరిగింది. ఇప్పుడు ఆయన 'మజాకా' సినిమా తీస్తున్నారు. సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్నారు. ఈ సంక్రాంతికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. 'మజాకా' తరవాత నక్కిన త్రినాథరావు రవితేజతో ఓ మరో సినిమా చేయబోతున్నట్టు టాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. అందుకు సంబంధించిన కథ కూడా సిద్ధం చేసుకొన్నట్టు సమాచారం. 'ధమా?కా' విడుదలైన వెంటనే నక్కిన త్రినాథరావుతో మరో సినిమా చేయడానికి రవితేజ ఆసక్తి చూపించారు. అయితే.. రవితేజ చేతిలో అప్పటికే చాలా సినిమాలున్నాయి. మరోవైపు నక్కిన త్రినాథరావు కూడా వేరే నిర్మాతల దగ్గర అడ్వాన్సు తీసుకొన్నారు. అందుకే రవితేజతో సినిమా కాస్త ఆలస్యమైంది. అయితే 'మజాకా' పూర్తయిన వెంటనే రవితేజతో సినిమా ఉండబోతోందని ఇన్ సైడ్ వర్గాలు నుంచి సమాచారం. 'ధమాకా' సమయంలోనే రవితేజకు మరో లైన్ చెప్పి 'ఓకే' చేయించుకొన్నాడు నక్కిన. 'మజాకా' పనులు ఓ వైపు జరుగుతున్నా, మరో రైటింగ్ టీమ్ తో రవితేజ కథపై చర్చలు జరుగుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.